# మోసం

—కె.ఎన్.వి.ఆంజనేయులు

మా ఊరు

వెళ్లిన ప్రతిసారీ

నేను

తప్పకుండా చేసే

పనొకటుంది.

అది-

ఒకసారి కాలి నడకన

ఊరంతా తిరగడం.

కేసరి మీదుగా ఓవర్ బ్రిడ్జి ఎక్కి, దిగి పెద్దాసుపత్రి మీదుగా రమామహల్, వెంకట్రామా టాకీస్ దాటి పవర్‌పేట స్టేషన్‌ మీదుగా వచ్చి పెద్ద వంతెన ఎక్కి వెంకటేశ్వరా, పెద్ద మార్కెట్ మీదుగా గడియారం స్తంభం వరకు ఊళ్లో వచ్చిన మార్పులు, చేర్పులు గమనిస్తూ నడుస్తుంటాను.

ఈసారి కూడా అదే కార్యక్రమంలో పెద్దాసుపత్రి, విజయ విహార్ దాటి వస్తుండగా కనిపించింది మధులత హోటల్. ఉదయం తిన్న టిఫిన్ అప్పటికే అరిగిపోవడంతో కాళ్లు హోటల్ వైపు దారితీశాయి.

సుష్టుగా టిఫిన్ చేశాను. అప్పటికీ, ఇప్పటికీ టిఫిన్ రుచిలో మార్పురాలేదు. అల్లం చెట్నీ, సాంబారు- అదే మధురిమ; అదే నెవులూరించే రుచి.

బిల్ తీసుకుని కౌంటర్ వైపు నడిచాను. అక్కడేదో చిన్న ఘర్షణ జరుగుతున్నట్లనిపించింది.

ఓ నిమిషం తరువాత నాకు అర్థమైన విషయం ఇది- గళ్ల చొక్కా వేసుకున్న ఒకతను టిఫిన్ చేసి మూడు రూపాయిల ముప్పావలా బిల్, యాభై రూపాయిల నోటూ కౌంటర్‌లో ఇచ్చాడట. కౌంటర్‌లో వున్నతను తిరిగి చిల్లర ఇవ్వలేదు సరికదా, నువ్వసలు యాభై రూపాయిల నోటే ఇవ్వలేదని దబాయిస్తున్నాడట.

ఇది గళ్ల చొక్కా అతని కథనం.

కౌంటర్‌లో వున్నతని కథనం ప్రకారం- గళ్ల చొక్కావాలా బిల్లు టేబుల్ మీద పెట్టేడు కాని, యాభై రూపాయిల నోటు కాదు కదా, మరే ఇతర నోటూ ఇవ్వలేదని చెబుతున్నాడు.

ఎవరి మాట నమ్మాలో తెలియడం లేదు. గళ్ల చొక్కా అతను గట్టిగా వాదిస్తున్నాడు తను యాభై రూపాయిల నోటు ఇచ్చానని. కౌంటర్‌లో వున్న వ్యక్తి కూడా గట్టిగానే చెబు తున్నాడు అతనే నోటూ ఇవ్వలేదని.

"అదేమిటి! అలా అంటారు? బిల్లు, యాభై రూపాయిల నోటూ టేబుల్ మీద పెడితే మీరు యాభై రూపాయిల నోటు సొరుగులో వేసుకో లేదూ? ఆ నోటు నెంబరు కూడా నాకు గుర్తే" అంటు న్నాడు గళ్ల చొక్కా అతను.

నాకు కుతూహలం కలి గింది. నేను కల్పించుకున్నాను.

"ఆ యాభై రూపాయిల నోటు నెంబరు మీకు గుర్తేనా?" అడిగేను ఆ గళ్ల చొక్కా వ్యక్తిని.

"అవును సార్! ఆ నోటు నెంబరు **J 26 362079**. కావలిస్తే సొరుగులో ఆ నెంబర్ గల నోటుందో, లేదో చూడమనండి" అన్నాడా గళ్ల చొక్కా అతను.

ఆ మాట వినగానే కౌంటర్లో వున్న వ్యక్తి సొరుగు తెరిచి యాభై రూపాయిల నోట్లను పరిశీలించసాగేడు.




మేమంతా అతన్నే గమనించ సాగేము.

ఓ యాభై రూపాయిల నోటును పైకి తీసి పరిశీలించిన అతని మొహం పాలిపోవడం గమనించాను నేను.

ఆ నోటు తీసుకుని పరిశీలించాడు. కరెక్ట్. అదే నెంబర్ నోటు.

"మాశారా సార్! అదే నేనిచ్చిన నోటు. మాశారా ఎలా

దబాయించాడో నేనసలు ఏ నోటూ ఇవ్వలేదని'' ఉత్సాహంగా అంటున్నాడు గల్లా చొక్కా అతను.

కౌంటర్లోని వ్యక్తి బిల్లు పోను మిగతా చిల్లర ఇవ్వడానికి ఆయత్తమయ్యాడు.

చటుక్కున నా మెదడులో ఫ్లాష్ వెలిగినట్టయింది. ఏదో మోసం జరిగిందని నా మనసు హెచ్చరిస్తోంది.

నేనిదివరకు ఎక్కడో విని నేను ఇటువంటి మోసం గురించి. ఇందులో ఇద్దరు వ్యక్తు లుంటారు. ముందుగానే ఓ వ్యక్తి హోటల్లో టిఫిన్ చేసి బిల్లూ, ఆ యాభై రూపాయిల నోటూ కౌంటర్లో ఇచ్చి మిగతా చిల్లర తీసుకుని వెళ్లిపోతాడు. ఆ యాభై రూపాయిల నోటు నెంబర్ రెండవ వ్యక్తి జ్ఞాపకం పెట్టుకుంటాడు. మరో పది నిమిషాల తర్వాత ఆ రెండవ వ్యక్తి హోటల్‌కి వచ్చి తను కూడా టిఫిన్ చేసి కౌంటర్లో నలుగురైదుగురు బిల్లు చెల్లించే సమయంలో బిల్లు మాత్రం టేబుల్ మీద వుంచి యాభై రూపాయిల నోటు ఇచ్చానని దబాయిస్తాడు. అతను చెప్పిన నెంబరు గల నోటు కేష్ బాక్స్‌లో వుండడంతో తప్పని సరిగా అతనికి మిగిలిన చిల్లర ఇచ్చేస్తాడు కౌంటర్లోని వ్యక్తి.

ఇప్పుడు జరిగినదదే అని నాకనిపిస్తోంది.

కౌంటర్లోని వ్యక్తి యాభై రూపాయిలలో బిల్లు మూడూ ముప్పావలా పోగా మిగిలిన చిల్లర నోట్లు తీసి ఆ వ్యక్తికి ఇవ్వబోతున్నాడు.

''ఆగండి గురూగారూ! ఒక్క నిమిషం'' అన్నాన్నేను.

కౌంటర్లోని వ్యక్తి ఆగేడు.

గల్లా చొక్కావాలా ముఖంలో కంగారు గమనించాను నేను.

''ఆ యాభై నోటేనా, మీ జేబులో ఇంకేమైనా నోట్లు న్నాయా?'' అనడిగేను ఆ గల్లా చొక్కా అతన్ని.

''ఎందుకు?'' ప్రశ్నించాడు అతను.

''ఊరికే! ఒకసారి ఇవ్వండి'' చెయ్యి చాపాను.

అతను జేబులోంచి కొన్ని నోట్లు తీసి నా చేతిలో పెట్టేడు.

ఓ అయిదు రూపాయిల నోటూ, రెండు రెండు రూపాయిల నోట్లూ, ఒక శిథిలావస్థలో వున్న రూపాయి నోటూ- అవి.

''ఆ ఇప్పుడు చెప్పండి. ఈ అయిదు రూపాయిల నోటు నెంబరెంత?'' అడిగేను.

''నెంబరా?'' గల్లా చొక్కా వ్యక్తి తెల్లబోయాడు.

''అవును చెప్పండి. ఈ అయిదు రూపాయిల నోటు నెంబరెంత? పోనీ ఈ మిగతా మూడు నోట్లలో ఏదో ఒక నోటు నెంబరు చెప్పండి చూద్దాం?'' అన్నాను సవాలు చేస్తున్నట్టు.

గల్లా చొక్కా అతని ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు.

చుట్టూ చేరిన వాళ్లు ఉత్సాహంతో గమనిస్తున్నారు ఈ తంతు.

''చెప్పలేరు! ఎందుకంటే నెంబర్లు గుర్తుంచుకోవలసిన అవసరం లేని నోట్లు ఇవి. అదీకాక ఈ 'చిన్న నోట్ల'తో 'పెద్దగా' అవసరం వుండదు కూడా. అంతేకదూ?'' అన్నాను.

అతను వంచిన తల ఎత్తలేదు. జరిగిన మోసమేమిటో చుట్టూ చేరిన అందరికీ వివరించి చెప్పేను.

కౌంటర్లోని వ్యక్తి ముఖంలోకి వెలుగొచ్చింది.

''చాలా థాంక్స్ సార్'' అన్నాడతను.

చుట్టూ చేరిన వ్యక్తులు తలో రకంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి మోసగాళ్లను పోలీసుల కప్పచెప్పాలంటున్నారు. అక్కర్లేదు మనమే తలో చెయ్యి వేస్తే సరిపోతుంది. మరోసారి ఇలాంటి మోసాలు చెయ్యడు అంటున్నారు మరికొంతమంది.

నేనా మాటలు పట్టించుకోకుండా నా బిల్ చెల్లించి బయటపడ్డాను. ●

